www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 ఆగస్టు 2024
5
చిత్తూరు



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) సోమవారం కార్యక్రమంను ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరం నందు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

శిథిలావస్థలో యుడిఎస్

- చిన్నపాటి వర్షాలకి పొంగుతున్న రోడ్లు, కాలువలు
- కొత్త ప్రతిపాదనకు రూ.200 కోట్లు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరింది. తిరుపతిలో చిన్నపాటి వర్షం కురిస్తే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగి ప్రవహించడమే కాకుండా మురుగు కాలువలు రోడ్లు చెరువులను తలపిస్తాయి. దీని ప్రధాన కారణం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడమే. ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొత్త కనెక్షన్ చేపట్టాలంటే సుమారు 200 కోట్ల రూపాయలు నిధులు అవసరం అవుతుంది.. తిరుపతి నగరపాలక సంస్థ వద్ద ఇంత పెద్ద మొత్తంలో నిధులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకంలో నిధులు ఇస్తే తప్ప కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించుకోనే పరిస్థితి లేదు.

గత నెలలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో తిరుపతి కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించుకోవడానికి ప్రతిపాదనలు పంపాలని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కోరడం జరిగింది. అందుకు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించుకోవడానికి 200 నుంచి 250 కోట్లు ఖర్చు అయ్యే అవకాశం ఉందని ప్రతిపాదనలు తయారు చేశారు. ఇంత పెద్ద మొత్తం నిధులు కార్పొరేషన్ వద్ద లేకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు టీటీడీ సహకరిస్తే కొత్త కనెక్షన్ నిర్మించి డ్రైనేజీ వ్యవస్థ నుంచి ప్రజలకు మేలు జరిగేలా చేయవచ్చని అధికారులు అంటున్నారు.

1996లో 18 కోట్ల రూపాయలతో తిరుపతి నుంచి రేణిగుంట తూకివాకం వరకు 14 కిలోమీటర్ల వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించడం జరిగింది. అప్పట్లో ఆర్ఆర్సి పైపులతో 25 సంవత్సరాలు కాల పరిమితితో నిర్మించారు. ప్రస్తుతం దాన్ని కాలపరిమిత ముగియడంతో కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డిఐ (ఇనుము) పైపులు పెట్టి 50 సంవత్సరాల కాలంతో నిర్మించాలని భావిస్తున్నారు. గతంలో తిరుపతి స్మార్ట్‌సిటీ పథకంలో యుడిఎస్ కొత్త కనెక్షన్ నిర్మించాలని ప్రతిపాదన తయారు చేస్తే ఆ పథకంలో దీన్ని తిరస్కరించడం జరిగింది. స్మార్ట్ సిటీ పథకంలో యు డేస్ వర్తించదని కేంద్రం స్పష్టం చేసింది.

తిరుపతి– రేణుగుంట మార్గానికే 100 కోట్లు...

తిరుపతి– రేణిగుంట మార్గంలో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ మార్చడానికి సుమారు 100 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇక్కడ తరచూ పైపులైన్ దెబ్బతింటూ ఉండడంతో నగరపాలక సంస్థ అధికారులు తాత్కాలిక మరమ్మతుల పేరుతో గత ఐదు సంవత్సరాల కాలంలో సుమారు 6 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ మార్గంలో పైపులైన్ మరమ్మతులు చేసిన ప్రైవేట్ టెలిఫోన్ ఆపరేటర్ కంపెనీలు తరచు కేబుల్ వేయడానికి రోడ్లు తవ్వుతూ ఉండడం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ దెబ్బ తినడానికి ఒక కారణమని చెప్పవచ్చు. గత ఐదు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి కార్పొరేషన్‌కి ఎటువంటి ప్రత్యేక పథకాలు నిధులు ఇవ్వకపోవడం వల్ల అండగా ఉంటాయని కొత్త నిర్మాణానికి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రాష్ట్రానికి పంపలేదు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ ఇలా...

తిరుపతి నగరంలో 1996లో వేసిన అండర్ గ్రౌండ్ కనెక్షన్ ఇంజనీరింగ్ అధికారులు రేణిగుంట మండలం తూకివాకం గ్రామంలో ఫిల్టర్ ట్యాంకు నిర్మించారు. అక్కడ నుంచి రేణిగుంట తిరుపతి రోడ్డు మార్గంలోని నాలుగున్నర ఇంచుల ఆర్ఆర్సి పైపుల ద్వారా తిరుపతి 14కిలోమీటర్ల లోపు కనెక్షన్ తీసుకురావడం జరిగింది. ప్రతి ఇంటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ ఇచ్చే విధంగా తీసుకురావడం జరిగింది. నగరంలో సుమారు 4లక్షల మంది జనాభా ఉన్నారు. 50 డివిజన్లకు గాను 60 వేల యుడిఎస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో నుంచి వచ్చే మురుగును నేరుగా రేణిగుంట మీదుగా తూకివాకం గ్రామంలో ఉండే మురుగునీటి ఫిల్టర్‌లో మురుగును ఫిల్టర్ చేసి అప్పట్లో రైతులకు ఉచితంగా పొలాలకు నీళు ఇచ్చేవారు. ప్రస్తుతం ఫిల్టర్ చేసిన మురుగు నీరుని కొన్ని ప్రైవేట్ ఫ్యాక్టరీలకు లీటర్ల చొప్పున నగరపాలక సంస్థ సరఫరా చేస్తుంది. ఇందుకు గాను ప్రైవేట్ కంపెనీను లీటర్ చొప్పున నగరపాలక సంస్థకు నగదు రూపంలో చెల్లిస్తున్నారు. ఏడాదికి నగరపాల సంస్థకు సుమారు 10 నుంచి 20 లక్షలు ఆదాయం వస్తుంది.

ఎలుకలతో దెబ్బతిన్నాయి ఇంటర్నల్ కనెక్షన్...

నగరంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇంటర్నల్ కనెక్షన్లు కూడా ఎలుకల వల్ల చాలా వరకు దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో




మార్చివేసి కొత్త కనెక్షన్ వేయాల్సి వస్తుంది మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఇటు రాష్ట్ర ప్రభుత్వ పాటు కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఓ నివేదికను తయారు చేసే ఇవ్వనున్నారు. నగరంలో చిన్నపాటి వర్షాలకి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగడం నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులకు ఓ సవాల్‌గా మారింది. వర్షాకాలంలో రాకముందే నగరంలో మురుగు కాలువలు కూడికతీత పనులు చేసేవారు ఈ ఏడాది మురుగు నీటి కాలువ పూడికతీత పనులు టెండర్లు ఆలస్యంగా పిలవడంతో పనులు నత్తనడక సాగుతున్నాయి. చాలా వరకు మాత్రం అండర్ గ్రౌండ్ దెబ్బ తినడానికి ఎలుకలు కూడా ఒక కారణమని స్థానికులు అంటున్నారు. ఏదిఏమైనా టిటిడి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయిస్తే కొత్త డ్రైనేజీ వ్యవస్థను నిర్మించుకోవచ్చు.

పింఛన్ ఇవ్వడం లేదయ్యా..!

ఎమ్మెల్యే ఎదుట వృద్ధురాలి ఆవేదన

ప్రజాశక్తి-ఐరాల : 'అయ్యా.. నాకు పింఛనుఇవ్వడంలేదు.. ఆపేశా రయ్యా..!' అంటూ ఎమ్మెల్యే మురళీ మోహన్ ఎదుట ఓ మహిళ కంట తడిపెట్టిన వైనం మండలంలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటిస్తున్న సమ యంలో ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. ఐరాల మండలం లోని రెడ్డివారిపల్లి బీసీ కాలనీలో రోడ్డుపై ఒంటరిగా నిలుచుకొని ఉన్న వృద్ధురాలు ఎమ్మెల్యే మురళీమోహన్ రాకను చూసి కారును నిలపాలని కోరింది. వృద్ధురాలికి ఏ కష్టం వచ్చిం దో అని గ్రహించిన ఎమ్మెల్యే మురళీ మోహన్ కారును ఆపి ఆ వృద్ధురాలి సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేశారు. గత ప్రభుత్వంలో అకస్మాత్తుగా తనకు పింఛను ఆపివేశారని ఎమ్మెల్యే వద్ద బోరున విలపించింది. తన పేరు రాధమ్మ అని, ఇస్తున్న పెన్షన్ గత ప్రభుత్వ హయాంలో హఠాత్తుగా నిపిలివేశారని ఎమ్మెల్యేకు తెలిపింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. రాధమ్మకు పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పింఛను ఎందుకు ఆగింది? అందుకు గల కారణాలను పరిష్కరించి వచ్చే నెల నుంచి పెన్షన్ అందేలా చూడండి..' అని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే స్పందించిన తీరుకు రాధమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న వృద్ధురాలు

నేడు రవాణా శాఖ మంత్రి పర్యటన

ప్రజాశక్తి -సోమల:

సోమవారం ఉదయం 10 గంటలకు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోమల మండల పర్యటనలో భాగంగా ఆవులపల్లి సీతమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన సభలో పాల్గొని అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడనున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. మంత్రి వెంట పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు.




రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంత

ప్రమాదం జరిగితే కాని పట్టించుకోరా?

-వాహనదారులకు ఇక్కట్లు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:

బంగారుపాలెం మండలం బంగారు పాళ్యం గాజుల పల్లి రోడ్ లో కరిడి వారి పల్లి గ్రామ సమీపంలో రహ దారిలో బ్రిడ్జి మధ్యలో రంధ్రం ఏర్పడి పెద్ద గోతిగా ప్రమా దంగా తయారైం దని, దీని వల్ల ద్విచక్ర వాహనదా రులకు భారీ వాహనా లకు ప్రమాదం జరిగే ఆస్కారం వుందని, రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాల నుండి ఈ రహదారి మీదుగా అర్ధగిరి, కానిపాకం భారీ వాహనాలు అతివేగంగా వెళుతున్నాయని రహదారులను మధ్యలోని గోతిలో పడి భారీ నష్టం జరగకముందే గోతిని మరమ్మతులు చేసి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపె వుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకుల ఇక్కట్లను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



నాలుగు మాడ వీధులను తనిఖీ చేస్తున్న అదనపు ఈవో

అక్టోబర్ 4 నుంచి

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:

తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12 వరకు జరుగనున్న నేపథ్యంలో నాలుగు మాడవీధుల్లో ఉన్న వివిధ ప్రవేశ, నిష్క్రమణ, హారతి పాయింట్ల గురించి తెలుసుకోవడానికి అన్ని గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన మండపం నుంచి ప్రారంభమై నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలు, తిరుమల నంబి ఆలయం వద్ద కదిలే వంతెన, గ్యాలరీల వద్ద ప్రవేశ నిష్క్రమణ పాయింట్లు మరియు ఇతర సంబంధిత సమాచారాన్ని అధికారులు అదనపు ఈవోకు వివరించారు. డిప్యూటీ ఈవో లోకనాథం, విజివో నందకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

మన ఊరును పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

- లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యం కావాలంటే మనం మన ఊరిని పరి శుభ్రంగా ఉంచుకునేలా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాల్సిన అసరర ముందని, పంచాయతీల్లో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు సకాలంలో నీటి పన్ను, ఇంటి పన్నులు చెల్లించాలని, ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం విడుదల చేసే నిధులు, ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలు చేసే డబ్బుతో పంచాయతీలో వీధి లైట్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి తెలిపారు. ఆదివారం వారు 'ప్రజాశక్తి' అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రజాశక్తి : చిత్తూరు జిల్లా జనాభా, గృహాల సంఖ్య ఎంత ?

డిపిఒ: చిత్తూరు జిల్లాలోని 31 మండలాల పరిధిలో697 గ్రామ పంచాయతీలున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 14,63,661 గృహాలున్నాయి. 6, ,541గ్రామ పంచాయతీ వార్డులున్నాయి. ప్రస్తుతం 684 మంది సర్పంచ్‌లు ఓటింగ్ ద్వారా ఎన్నికైన వారు వున్నారు.

ప్రజాశక్తి: ఈ ఆర్థిక సంవత్సరం అంటే 2023–24 విడుదలైన నిధులు ఎంత?

డిపిఒ: ప్రభుత్వం వివిధ గ్రాంట్స్ రూపంలో ఆ ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా జిల్లాలోని 697 గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం అంటే మేజర్ 11, మైనర్ 686 పంచాయతీలకు మొదటి విడతగా తలసరి గ్రాంట్ రూ.59,63,132, సీనరైజ్ గ్రాంట్ 2,34,22 కేటాయించగా సర్పంచ్‌ల గౌరవ వేతనం కోసం రూ 2,50,92,000 కేటాయించింది.

ప్రజాశక్తి : సీనరేజ్ నిధులు ఎలా వసూలు చేస్తారు?

డిపిఒ: సీనరేజ్ ఛార్జీల రూపంలో ఇసుక, గ్రానైట్, కంకర క్రషరింగ్ వాటి నుండి సీనరైజ్ పన్ను వసూలు చేస్తామని ఇందులో జిల్లా పరిషత్‌కు, గ్రామ పంచాయతీకి ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కేటాయిస్తాం.. ఉచిత ఇసుక సరఫరా విధానం అమల్లోకి రావడంతో సీనరైజ్ పనులు వసూలు చేసి స్థానిక గ్రామ పంచాతీలకు జమ చేస్తారు.

ప్రజాశక్తి: సాలిడ్‌వేస్ట్ సెంటర్లు ఎన్ని నిర్మించారు? ప్రస్తుతం వాడకంలో ఉన్నవి ఎన్ని...?

డిపిఒ: జిల్లాలో 2021 నుండీ సాలిడ్‌వేస్టు ప్రాసెసింగ్ సెంటర్లు నిర్మించాం. ప్రస్తుతం 543 వాడకంలో ఉన్నాయి. 1,743 మంది క్లాస్ మిత్రలుగా పని చేస్తున్నారు.

ప్రజాశక్తి : మనం మన పరిశుభ్రత కార్యక్రమంలో పంచాయతీలకు అందించిన పరికరాలేమిటి?

డిపిఒ: మనం మన పరిశుభ్రతలో భాగంగా గ్రామ పంచాయతీకు 513 ఫాగింగ్ మిషన్స్, 32 ట్రాక్టర్లు, 23 డిజిల్ ఆటోలు, 703 టాయిలెట్ క్లీనర్స్, 665 ఇన్సులేటర్లు, 1153 ట్రైసెకిల్స్ అందించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం 15వ ఆర్థికసంఘం నిధుల నుండీ నిధులు మంజురు కానున్నాయి. జిల్లాకు 40 కోట్లు నాలుగో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు మంజురయ్యే అవకాశం వుంది.



పునాదులకే పరిమితం!

- పక్కా భవన నిర్మాణానికి నోచని వైనం
- 30 ఏళ్లు అవుతున్నా మారని వెలుగు కార్యాలయం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరులో వెలుగు కార్యాలయ నూతన భవన నిర్మాణం పునాదులకే ఆగిపోయింది. 30 ఏళ్లు గడుస్తున్నా నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదు. దీంతో ప్రస్తుతం వున్న వెలుగు కార్యాలయంలో సమావేశానికీ స్థలం చాలక డ్వాక్రా సంఘాల మహిళలు ఇబ్బందులు ఎదుర్కో వాల్సిన దుస్థితి ఏర్పడింది.

నియోజకవర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరులో వెలుగు కార్యాలయానికి పక్కా భవనం సౌకర్యం లేక డ్వాక్రా సంఘాల మహిళలు ఏళ్ల తరబడిగా అవస్థలు ఎదుర్కొంటున్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు నాంది పలికారు. ఆ సమయంలోనే ప్రతి మండలానికి డ్వాక్రా సంఘాల అభివృద్ధికి వెలుగు కార్యాలయాన్ని ప్రారంభించారు. అయితే అప్పటి నుండి వెలుగు కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. 2011లో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ హయాంలో వెలుగు కార్యాలయం భవన నిర్మాణానికి రూ. 25 లక్షలు మంజూరు చేయించారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. పిల్లర్లతో బేస్‌మెంట్ వరకు పనులు సాగాయి. ఈ నిర్మాణాన్ని ఆపివేయాలంటూ ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. కోర్టును ఆశ్రయించిన వ్యక్తి కొంత కాలం తర్వాత మృతి చెందాడు. ప్రస్తుతం ఆ స్థలంలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు ఏపుగా



పునాదులకే పరిమితమైన గంగాధర నెల్లూరు మండల వెలుగు కార్యాలయ భవనం

పెరిగిపోయాయి. సమావేశం నిర్వహించుకోవడానికి తగినంత స్థలం లేక డ్వాక్రా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వెలుగు భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

వయోవృద్ధుల దర్శనంపై పుకార్లను నమ్మవద్దు

భక్తులకు టీటీడీ మరో మారు విజ్ఞప్తి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్ మీడియాలో గత కొంతకాలంగా చక్కర్లు కొడుతున్నాయి. ఇవి పూర్తిగా అవాస్తవమని, వాస్తవం ఏమిటంటే, ప్రతిరోజు 1000 మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టిటిడి ప్రతి నెల 23 మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50ల ఒక లడ్డూ ఉచితంగా లభిస్తుంది. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్, పిహెచ్‌సి లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఇలాంటి తప్పుడు వార్తలు లేదా వదంతులను నమ్మవద్దని టీటీడీ భక్తులకు మరోమారు విజ్ఞప్తి చేసింది. భక్తులు సరైన సమాచారానికి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www.tirumala.org, https://ttdevastanams.ap.in ను మాత్రమే సంప్రదించాలని సూచించారు.

ఎస్వీయూలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో

సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సుకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2024 సంవత్సరానికి యస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో బిటెక్ (సిఎస్ఈ) సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులో చేరడానికి ఎపి ఈఎపి సెట్ – 2024లో ర్యాంక్ పొందిన అభ్యర్థులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం. భూపతినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆఖరి తేదీని పొడిగించామని, ర్యాంక్ పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 12వ తేదీన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో కౌన్సెలింగ్, అడ్మిషన్స్ నిర్వహిస్తారని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఫీజుతో రావాలని సంబంధిత విద్యార్థులను కోరారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- వివరాలు వెల్లడిలో గోప్యం
- గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం:

శ్రీరంగరాజపురం మండలం పిల్లారికుప్పం సమీపంలో 42 ఎర్ర చందనం దుంగలను పట్టుకున్నామని వీటి విలువ దాదాపు 7 లక్షల రూపాయలు వరకు ఉంటుందని ఎస్ఐ రాజకుల్లాయప్ప ఆదివారం పేర్కొన్నారు. అయితే నిందితుల వివరాలు గోప్యంగా వుంచడంతో ఆ గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐ కథనం మేరకు.. పిచ్చాటూరు మండలానికి చెందిన రవినాయుడు ఫారెస్ట్ అధికారుల వద్ద నుంచి ఎర్రచందనం చెట్లు కొని, డ్రెస్సింగ్ చేసి, వాటికి నంబర్లు వేసి వాటిని ప్రభుత్వానికి అప్పగించేందుకు అనుమతులు పొందారని అదే క్రమంలో ఆయన పిల్లారి కుప్పం గ్రామానికి చెందిన ఎక్స్ ఆర్మీ రవి నాయుడు పొలంలో ఉన్న ఎర్రచందనం చెట్లు కొని వాటిని డ్రెస్సింగ్ చేసి ఆయన పొలంలోనే ఒక గొడౌన్ ఏర్పాటు చేసి వాచ్‌మ్యాన్ నియమించినట్లు తెలిపారు. గత నెల 23వ తేదీ గుర్తు తెలియని వ్యక్తులు వీటిలో కొన్ని దుంగలను దొంగిలించి తీసుకెళ్లారని తమకు ఫిర్యాదు అందడంతో నిఘా వుంచామని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం తమకు అందిన రహస్య సమాచారం మేరకు 42 దుంగలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. దీనిపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఎస్ఐ సమాధానం ఇవ్వకుండా దాటవేస్తూ వెళ్లిపోయారు.

వివరాల వెల్లడిలో గోప్యం ఎందుకు?

ఎర్రచందనం దొంగతనం కేసులో పిల్లారి కుప్పం గ్రామానికి చెందిన బాలాజీని అదుపులోకి తీసుకొని అతని తన వాహనంలో విచారణ నిమిత్తం హడావిడిగా బయటికి తీసుకెళ్లారని అదే గ్రామానికి చెందిన పలువురు ఆరోపిం చారు. ఎర్ర చందనం దుంగలను శనివారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు తరలించా రని ఎన్ని తరలించారు? ఎంత బరువు అన్న విషయం గోప్యంగా ఉంచా రని స్థానికులు పేర్కొంటు న్నారు. అదే గ్రామానికి చెందిన మరి కొంతమంది ప్రముఖుల పేర్లు బాలాజీ చెప్పినా పట్టించు కోవడం లేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. వైసిపి నాయకులకు ఎస్ఐ వంత పాడుతూ అసలు దొంగలను వదిలేస్తున్నారని, స్థానికులు వాపోతున్నారు. బాలాజీ అమాయకుడని బాలాజీ వెనక పెద్ద నాయకు లు ఉన్నారని బాలాజీ కుటుంబ సభ్యులు వాపోయారు.

స్థానికుల నిరసన

దీనికి సంబంధించిన నాయకులను అరెస్టు చేయాలని ఎస్ఐ తీరుకు వ్యతిరేకం గా స్థానికులు రోడ్డుపై బైఠాయించి వెంటనే నిందితులను అరెస్టు చేయాలని నిరసన వ్యక్తం చేశారు.





మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన వాటర్‌షెడ్ మాజీ ఛైర్మన్ గుణశేఖర్‌నాయుడు

మాజీ సిఎంని కలిసిన వాటర్‌షెడ్ మాజీ ఛైర్మన్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని పిల్లి గుండ్ల పల్లి గ్రామానికి చెందిన మాజీ వాటర్ షెడ్ ఛైర్మన్ గుణశేఖర్‌నాయుడు చిత్తూరుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని తన అనుచరులతో కలిశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనకు శాలు వా కప్పి, పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. మండల అభివృద్ధికి సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటపైనేని మురళి, గిరి పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి ఉత్సవాలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలోని చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి ఉత్సవాలకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు సిఆర్ రాజన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో వారు పాల్గొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనం స్వాగతం పలికి సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సకాలంలో వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో అన్ని రంగాలలో రాణించాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు పట్టణ నాయకులు ఆర్వీ బాలాజీ, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, లోకేష్, వెంకట్రమణ, సుదర్శన్, విజయ్, మురళీ, మోహన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తెలుగు భాషా పోటీలు

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం స్థాయి గార్డెన్ సిటీలో నెలకొన్న కళా మందిరంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి తెలుగు భాషా పోటీలను తెలుగు సాహిత్య సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వివిధ భాషా పోటీలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరు, ఏడు తరగతులు చదివే విద్యార్థులకు 'తెలుగు భాష గొప్పదనం' అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసం ఉండాలని ఐదో తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులు 'నేటి తెలుగు భాష దుస్థితి' అనే అంశంపై మూడు పేజీలకు మించకుండా ప్రభుత్వ తపాల ద్వారా కళామందిరం చిరునామాకు ఈనెల 15వ తేదీ లోపు పంపాలన్నారు. ఒకటో తరగతి నుండి 5వ తరగతి లోపు పిల్లలు నూరు నీతి పద్యాలు చెప్పగలిగే విద్యార్థులు 9553429770 ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ఒక్కొక్క విభాగానికి 20 మంది చొప్పున 60 మంది గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తామని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



దోమల మందు పిచికారీ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

దోమల నివారణ మందుల పిచికారీ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు, 81 చిన్న ఉప్పర పల్లి, బోనమంద గ్రామ లలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో ఈఓఆర్డి లక్ష్మీదేవి పర్యవే క్షణలో మిలాధిన్ ద్రావణా న్ని పిచికారీ చేశారని తెలిపారు. దోమల ప్రబల కుం డా ముందు జాగ్రత్త చర్యగా ద్రావణాన్ని స్ప్రే చేశారని వారు తెలిపారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -గుడూరు టౌన్: పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఇలగనూరు సుబ్బరత్నమ్మ వర్ధంతి సందర్భంగా వారి భర్త వెంకయ్య కుమారుడు రమణయ్య సహకారంతో 50మంది నిరుపేద మహిళలకు చీరలు, వెజిటేబుల్ బిర్యాని పంపిణీ చేశారు. సంఘసేవలో విశేష సేవలకు గుర్తింపుగా హోప్ తీయాలజికల్ యూనివర్సిటీ వారు ప్రగతి కుటుంబ సభ్యుడు ఇసుగుంట రమేష్ కి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మెదనూరు సురేష్ రెడ్డి, వాచ్ షాపు రాము, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, శివకుమార్ రెడ్డి, పెంచలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి -గుడూరు టౌన్: ఏపీ బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎంపీ మాట్లాడుతూ గూడూరు బ్రాహ్మణ సేవ సంఘాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి శ్రీనివాస రావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రామమూర్తి, శ్రీనివాస్ కుమార్, నరసింహ రావు, కమల కుమారి, గాయత్రి, పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం: తనుజ

ప్రజాశక్తి-గుడూరు టౌన్:
పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు క్రమం తప్పకుండా తల్లిపాలు అందిస్తే ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షులు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తనుజ తెలిపారు. పట్టణం లోని సరస్వతి శిశు మందిరంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు తల్లిపాల ప్రాముఖ్యతను బాలింతలకు వివరించారు.

బీసీ ఉద్యోగులపై దాడులను అరికట్టండి

ప్రజాశక్తి -క్యాంపస్:
రాష్ట్రంలో బీసీ ఉద్యోగులపై దాడులు, వేధింపులు అరికట్టాలని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ కు వినతి పత్రం అందజేశారు. బీసీలకు రక్షణ కల్పించాలని కోరారు.

మృతులకు నివాళి

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి):
చంద్రగిరి మండలం గంగుడుపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పందికుంట నారాయణరెడ్డి తల్లి పందికుంట రాములమ్మ, మండపంపల్లి గ్రామంలోని టిడిపి నాయకుడు జోజి రెడ్డి చిత్రపటాలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆదివారం జరిగిన కర్మ క్రియలకు ఆయన హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించండి..

కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే వినతి



ప్రజాశక్తి- ఐరాల: పూతల పట్టులో పరిశ్రమల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయక శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ కోరారు. కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయక శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరసిద్ధి వినాయక స్వామి వారి దర్శనార్థం కాణిపాకంకు కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు పూతలపట్టు శాసన సభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వీరికి కాణిపాకం ఆలయ ఈవో దర్శన ఏర్పాట్లు చేశారు. పూతలపట్టు అభివృద్ధిపై కేంద్రమంత్రితో ఎమ్మెల్యే మురళీమోహన్ కొంతసేపు చర్చించారు. పూతలపట్టు నియోజకవర్గం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రదేశం కావడంతో అందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. పూతలపట్టు నియోజకవర్గంలో నూతన పరిశ్రమలు తీసుకు వస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం దక్కుడంతో పాటుగా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే మురళీమోహన్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి పూతలపట్టు నియోజకవర్గంలో త్వరలోనే పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చారు.

మాజీ సిఎంతో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా ఏర్పాటు చేసిన కలిసి తేనీటి విందులో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అమరనాథ రెడ్డి తండ్రి, తమ తండ్రి మంచి మిత్రులని, తాను అమరనాథ రెడ్డి అదే స్నేహాన్ని కొనసాగిస్తున్నామని, ఎమ్మెల్యేగా ఇద్దరూ చాలా సంవత్సరాలు పనిచేశామని, ఆయన తెలిపారు. జనసేన, బిజెపి టిడిపి కూటమిగా ఏర్పడి ప్రజలు ఇచ్చిన అత్యధిక మెజారిటీతో, అధికారంలోకి వచ్చిందని, ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 15 వేల కోట్లు ఇవ్వడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని, చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పోలవరం పూర్తయితే ఏడు లక్షలా 20 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు, గోదావరిలో10 లక్షల ఎకరాలకు స్థిరీకరణ, కృష్ణా బేసిన్ కింద 13 లక్షల ఎకరాలకు స్థిరీకరణ. మొత్తంగా 23 లక్షల ఎకరాలకు స్థిరీకరణ, సాగునీరు అందుతుందని తెలిపారు. 960 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కరెంట్ యూనిట్ 10 నుండి 15 పైసలకే తయారు చేయవచ్చని, కృష్ణ వాటర్ మన



తేనీటి విందులో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

రాయలసీమకు అందుతుందని, ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం ఎన్నో సమస్యలు ఎదుర్కొం దని, వాటన్నింటినీ కూటమి ప్రభుత్వం సమర్ధ వంతంగా సరిచేసి చంద్రబాబు ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మాట్లాడుతూ కీలపట్ల దేవస్థానం టిటిడి పరిధిలో తేవడానికి కిరణ్ కుమార్ రెడ్డి పాత్ర ఎంతో ఉందని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కీలపట్ల దేవస్థానాన్ని టిడిపి పరిధిలో తీసుకొచ్చారని నేడు కీలపట్ల దేవస్థానం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కీలపట్లకు వెళ్లడానికి వున్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు ఏర్పాటు చేస్తే గుడి మరింత అభివృద్ధి చెందుతుంది అని విలేకరులు ప్రస్తావించగా ఇందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్‌వి బాలాజీ, రామచంద్ర నాయుడు, ఆర్బిసి కుట్టి, గిరి, ఖాజా పీర్, సోమశేఖర్ గౌడ్, విజయభాస్కర్ రెడ్డి, బిజెపి నాయకులు విజయ్, శరవణ, జనసేన నాయకులు దిలీప్, పూల చైతు, నాగరాజు, చందు, శివ , టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుండి భూములను రక్షించాలి

ఓ దళిత మహిళ అభ్యర్థన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: అగ్ర వర్ణానికి చెందిన కబ్జా దారుల నుండి తమ భూములను రక్షించి న్యాయం చేయాలని బైరెడ్డిపల్లి మండలం తాతిరెడ్డిపల్లికి చెందిన వెంకటలక్ష్మి అభ్యర్థించింది. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాను దళిత మహిళనని, తరతరాల నుండి సర్వే నెం.174/2 లో ఎ.1.24 సెంట్లు సాగు చేసుకుంటున్నానని తెలిపారు. ఈ భూమిపై పెత్తందారుల కన్ను పడిందని, ఎలాగైనా రోడ్ సైడ్ భూమిని కబ్జా చేయాలని రెవెన్యూ వారితో లాలూచీపడి తమ ఊరికి చెందిన అశోక్ కుమార్ పట్టా చేసుకున్నాడని వాపోయింది. ఈ విషయం తమకు తెలిసే లోపే అశోక్ కుమార్ హైకోర్టు దాకా వెళ్లిపోయాడని, కోర్టు ఇన్‌జంక్షన్ ఆర్డరు ఇచ్చిన విషయం తనకు తెలియదని తెలిపింది. ఈ నెల 2వ తేదీ ఉలవలు చల్లుదామని వెళితే అశోక్ కుమార్ దున్నడానికి వచ్చాడని, తాను అడ్డుకున్నానని అశోక్‌కుమార్ ' ఈ భూమి నాది.. అడ్డువస్తే ట్రాక్టర్‌తో తొక్కించి చంపేస్తాను..' అని బెదించాడని వాపోయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, కులం పేరుతో తిట్టానని వీడియో చూపితే కేసు పెడతానని చెప్పి వెనక్కి పంపారని వాపోయింది. ఓ పేపరుపై తన వద్ద సంతకం పెట్టుకున్నారని ఆ తర్వాత అశోక్ కుమార్ పై ఎలాంటి చర్య తీసుకోవద్దని తాను రాసి ఇచ్చినట్లు పేరుపై వుందని తెలిసిందన్నారు. ప్రస్తుతం తమకు వున్న భూమే జీవనాధారమని పోలీసులు న్యాయం చేయకుంటే



మాట్లాడుతున్న బాధిత మహిళ వెంకటలక్ష్మి

ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేసింది. తహశీల్దారు స్పందించి తమకు న్యాయం చేయాలని లేదంటే ఈ నెల 5వ తేదీ తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడుతానని హెచ్చరించింది.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి: ఏపీవో

ప్రజాశక్తి -గంగవరం: ప్రస్తుతం ఉపాధి వేతనాలు ప్రతివారం జమ అవుతున్న కారణంగా వేతన దారులు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మురుగేషన్ కొత్తపల్లిలో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు కుర్నిపల్లిలో జరుగుతున్న చెరువు కాలువ పూడికతీత పని, కలగటూర్‌లో నిర్మిస్తున్న పంట కుంటలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేతన దారులతో మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఉపాధి పనులు చేసుకుని వంద రోజుల ఉపాధి పొందాలని కోరారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే కొత్త పనులు మంజూరు చేస్తామని ఇందులో అమృత్ సరోవర్లు, మినీ అమృత్ సరోవర్లు, పంటకుంటలు, పండ్ల మొక్కల పెంపకం, పూల మొక్కల పెంపకం, చెరువు కట్టల బలోపేతం తదితర పనులు మంజూరు చేస్తు న్నారని, వేతన దారులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరితో పాటు పుంగనూరు ఏపీడీ సునీల్ కుమార్, ఏపీఓ మురుగేషన్, జెయి కోదండపాణి, టీఏలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న ఏపీవో మురుగేషన్

కూటమి ప్రభుత్వంపై ఆశావహ దృక్పథం

పలమనేరు ఏపీ ఎన్‌జీవో అధ్యక్షులు ఆనందబాబు

ప్రజాశక్తి -గంగవరం: గత పాలకుల వలే కాకుండా ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి లబ్ధి చేకూరుస్తుందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు ఆశావహ దృక్పథంలో వున్నారని పలమనేరు ఏపీ ఎన్‌జీవో అధ్యక్షులు ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొన్నారని, సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఉద్యోగులను మభ్యపెట్టి వారి ఓట్లు దండుకొని అధికారంలోకొచ్చిన గత ప్రభుత్వం ఉద్యోగులను నిలువునా మోసం చేసిందన్నారు. ఇచ్చిన 27శాతం ఫిట్ మెంట్‌ను కూడా తగ్గించి 23 శాతం కలిపి పి రివిజన్ చేసి, ఇచ్చిన దాన్ని సైతం వెనక్కి తీసుకొన్న ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రావాల్సిన డీఏ బకాయిలు ఒక్కటి కూడా ఇప్పటి వరకూ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించక పోవడం అత్యంత దారుణమని, ఉద్యోగుల భవిష్య నిధి , ఏపీజీఎల్ఐ మొత్తాలనూ వారికి చెల్లించ కుండా ఆ మొత్తాలను వేరే పద్దులకు మళ్లించి వారిని ముప్పు తిప్పలు పెట్టిందన్నారు. ఇంటి అద్దె అలవెన్సులు తగ్గింపు, రవాణా భత్యాలు చివరికి పోలీసులకు కూడా చెల్లించక పోవడం, సరెండర్ లీవు బిల్లులను తొక్కి పట్టడం, ఆరోగ్యశ్రీ మెడికల్ బిల్లులను చెల్లించ కుండా ఏళ్ల తరబడి నిలబెట్టడం చేసి



ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కనీసం ఒకటవ తేదీ జీతాలు, పెన్షన్లు చెల్లించకుండా నెల సగం రోజులు కూడా కొద్ది కొద్దిగా చెల్లించడం లాంటి విఫల ఆర్థిక విధానాలను అవలంబించడం వల్ల ఉద్యోగ వర్గాలు తీవ్ర నిరాశకు చెందారన్నారు. ఉపాధ్యాయులకూ బోధనేతర పనులు అప్పగింత, వైద్య ఉద్యోగులను యాప్‌లతో వేధించడం, అంతేకాక అధికార వ్యవస్థలను విపరీతంగా దుర్వినియోగం చేసి అనేక ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులపైన కేసులు బనాయించి, ఒత్తిడి గురి చేసి ఆందోళనలు చేపట్టకుండా నిరోధించడం వంటివి చేసి ఉద్యోగ వ్యతిరేక ప్రభుత్వంగా మూటగట్టుకుందన్నారు. ఈ కారణంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించిందని, ఈ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీవో తాలూకా అధ్యక్షులు ఆనందబాబు కోరారు.

మండల అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయొద్దని, అందరూ కలిసి పని చేస్తే అభివృద్ధిని సాధించవచ్చని, ఎమ్మెల్యేగా ప్రతి నెలా జీతం తీసుకుంటున్న ఉద్యోగినని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. ఆదివారం పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండల అధికారులతో పూతలపట్టు శాసన సభ్యులు డాక్టర్ శ్రీ కలికిరి మురళీమోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పూతలపట్టు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా నేను పని చేస్తానని...ప్రతి ఒక్కరూ సహకరిస్తే అభివృద్ధి అనేది నేను చేసి చూపిస్తానన్నారు. ప్రజా ధానాన్ని దుర్వినియోగం చేయొద్దని, అందరూ కలసి పని చేద్దాం.. మండల అభివృద్ధి సాధిద్దామని, తాను ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటున్న ఉద్యోగి అని చెప్పారు. మండల అభివృద్ధికి ప్రతి శాఖ అధికారులు, ఉద్యోగులు సలహాలు, సూచనలు ఇవ్వాలని, గత ప్రభుత్వంలో డబ్బులు ఖర్చు చేసారే గానీ అభివృద్ధి జరగలేదన్నారు. ఒక కోటి యాభై లక్షల రూపాయలు నిధులు ఐరాల మండల తీసుకుకొచ్చానని గత ప్రభుత్వం హయాంలో ఐరాల మండలంలో 109 పనులకు మంజూరు చేస్తే అందులో కేవలం 49 పనులు పూర్తి చేశారని, ఇలా అధికారులు పని చేస్తే మండల అభివృద్ధి జరగదని, అభివృద్ధి చేశామనే సమాచారాన్ని అధికారులు ఇస్తే ఆ అభివృద్ధి పని జరిగిన ప్రదేశాన్ని తానే స్వయంగా పరిశీలించి నిధులు దుర్వినియోగం గుర్తించి ఉద్యోగం నుండి ఆ అధికారిని తొలగిస్తామని ఆగ్రహించారు. ఏ పంచాయతీలో గానీ, ఏ పనికైనా గానీ ప్రజలు అనవసరంగా అర్జీలు పట్టుకుని తిరగ వద్దని, పని ఏంటో తనకు తెలియజేస్తే.. ఆ పని స్థితిగతులు కనుక్కొని వేంటనే ఆ పని పూర్తి చేయిస్తాన్నారు. మొదటి విడదలో పూతలపట్టు నియోజకవర్గంలో మురుగునీటి కాలువలకు, డ్రైనేజీలకు పెద్దపీట వేస్తున్నామని, ఏ పంచాయతీల్లో గానీ, ఏ గ్రామాల్లో గానీ వీటి అవసరాలు ఉన్నాయో తనకు తెలియజేస్తే సంబంధిత ఉన్నత అధికారులతో చర్చించి పూతలపట్టు నియోజకవర్గంను అభివృద్ధి పదంలో నడుపుతామన్నారు. ఐరాల మండలంలో ఎంత మంది గ్రీన్ అంబాజిటర్స్ కు జీతాలు ఇవ్వాలో పూర్తి వివరాలు అందిస్తే... సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతుల వ్యవసాయానికి రోజు తొమ్మిది గంటలు విద్యుత్ అందించేలా సంబంధిత మంత్రితో నేను మాట్లాడతానని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఐరాల మండల అధికారులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనం ఢీ

భర్త మృతి, భార్యాపిల్లలకు గాయాలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: ద్విచక్రవాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని పద్మసరస్సు వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పద్మసరస్సు ఎస్టీ కాలనీకి చెందిన పండయ్య కుమారుడు అయ్యప్ప(30) తమ భార్య పిల్లలతో కలసి కార్వేటినగరానికి వచ్చేందుకు ద్విచక్రవాహనంపై తమ భార్య పిల్లలతో కలసి గ్రామం నుంచి చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపైకి వచ్చారు. అయితే కార్వేటినగరం వైపు నుంచి పుత్తూరు వైపుగా ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి అతి వేగంగా ఢీకొనడంతో అయ్యప్పకు తీవ్ర గాయాలయ్యింది. తమ భార్య పిల్లలకు కూడా తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గ మధ్యంలో ఆయ్యప్ప మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన భార్య పిల్లలను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో అయ్యప్ప కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తహశీల్దారు మాధవరాజు బాధ్యతల స్వీకరణ



తహశీల్దారు మాధవరాజును సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలం నూతన తహశీల్దారుగా ఎస్ మాధవ రాజు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నగరి నియోజకవర్గ విజయపురం మండలం నుండి డిప్యూటేషన్‌పై ఆదివారం బైరెడ్డిపల్లికి వచ్చారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సిబ్బంది సమక్షంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి పూల మాలలు తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మర్యాద పూర్వకం గా మండల టిడిపి అధ్యక్షుడు కిషోర్ గౌడును కలిశారు. కిషోర్ గౌడు నూతన తహశీల్దారు మాధవ రాజును పూలమాల వేసి సత్కరించారు.

జిల్లాను సమగ్రాభివృద్ధికి పోరాటం చేయాలి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపు నిచ్చారు. ఆదివారం కట్టమంచి రోడ్ లోని మ్యాంగో మార్కెట్ పక్కన ఉన్న ఎస్ ఎంవి కల్యాణ మండపంలో సిపిఐ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందు కేరళ వరదల్లో మరణించిన వారికి సమావేశం ప్రగాఢసంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో సిపిఐ ప్రజా సంఘాల పరిస్థితిని, జిల్లా కార్యవర్గ సభ్యుల పని విధానాన్ని వివరించారు. చిత్తూరు జిల్లాలో పార్టీని, ప్రజా సంఘాలను బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సిద్ధపడాలని తెలిపారు. జిల్లాల విభజన సందర్భంగా అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో ఉన్నప్పటికీ చిత్తూరు జిల్లా పూర్తిగా వెనకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా చిత్తూరు జిల్లా అభివద్ధికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు . అధికారం లో ఉన్న టిడిపి ఎంపీలు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు.



ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కుప్పం పిఈఎస్ వైద్యబృందం చే 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఆరుగురు ఆపరేషన్ లకు ఎంపిక అయినట్లు మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ పిఆర్‌ఓ శ్రీనివాసులు తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణం కొత్తపేటలోని పెద్దపల్లి గంగమాంబ దేవాలయం వేదికగా కొత్తపేట ఇన్‌ఛార్జి ముఖేష్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, రాష్ట్ర టిడిపి నాయకులు గోపీనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగిన ప్రతిసారి కుప్పం పట్టణంలో కొత్తపేట నుండి చంద్రబాబు నాయుడుకి ఎక్కువ మెజారిటీ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం కొత్తపేట అభివృద్ధిపై చర్చిస్తూ, స్థానిక అవసరాలపై ప్రతి ఒక్కరూ సలహాలు సూచనలు అందిస్తూ, అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు హరినాథ్ గౌడ్, వాసు,15 వార్డ్ ఇన్‌ఛార్జి సుకుమార్, మునెప్ప, బూత్ ఇన్చార్జులు సుజి,లోకేష్, కృష్ణన్, మణి, మురళి పాల్గొన్నారు.



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల స్నేహితుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని కుప్పం పట్టణంలోని తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ క్యాంపు కార్యాలయంలో తెలుగు తమ్ముళ్ల వేడుకలు నిర్వహించుకున్నారు. ఆదివారం ఉదయం కుప్పం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ ఉమాపతి, ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీకి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి స్నేహానికి గుర్తుగా గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని బహూకరించారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: యువతరం సేవ సమితి పదవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బ్ల డ్ డ్రైవ్ క్యాంప్లో పాలొగొన్ని రక్తాధానం చేసిన స్వే చ్ఛ ఫౌండేషన్ ఫౌండర్ వంశీ పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్త దానం చేయడం ద్వారా మరొక ప్రాణాన్ని కాపాడిన వాళ్ళం అవుతామని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన యువతరం సేవ సమితికి ధన్యవాదాలు తెలిపారు.

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కేరళలోని వయనాడ్ జిల్లాలో తీవ్ర వర్షంతో కొండ చరియలు విరిగిపడి 600మంది పైగా గల్లంతయ్యారని ఈ విపత్తులు సర్వం కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవడానికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పేడులో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తలారి బాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కలపాటి గురవమ్మ పాల్గొన్నారు.